ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కులకచర్ల, జనవరి 17: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కులకచర్ల ఎస్ఐ శ్రీశైలం అన్నారు. కులకచర- ఘనపూర్ మార్గంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పెండింగ్‌లో ఉన్న చలాన్లు గడువులోపు చెల్లించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించి సంబంధిత ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.



- సరదాగా మొదలై.. వ్యసనంగా మారి..
- మత్తుకు బానిసవుతున్న యువత
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- జిల్లా సరిహద్దుల నుంచి గుట్టుగా సరఫరా
- ఇటీవల కాలంలో వరుసగా పట్టుబడుతున్న గంజాయి, డ్రగ్స్



కొత్తూరులో పోలీసులు పట్టుకున్న గంజాయి చాక్లెట్లు (ఫైల్)

ఫ్రెండ్స్ బర్త్‌డే రోజనో... శుభకార్యమనో.. లేక బాధాకర సందర్భమో గానీ.. 'నిషా' అందిస్తున్న మత్తు.. గమ్మత్తుగా మారి... స్నేహహస్తం బతుకునే.. ఉప్పెనలా ముంచేస్తోంది. మత్తు కాటుకు యువత చిత్తవుతోంది. సరదాగా ప్రారంభమైన ఈ వ్యసనం.. చివరకు అలవాటుగా మారి ఆరోగ్యాన్ని బలి తీసుకుంటోంది. చివరికి ఎందరి జీవితాలకో శాపంగా మారుతోంది. గంజాయి, డ్రగ్స్ మాఫియా చిన్న పిల్లలను కూడా వదలడం లేదు. ఇటీవలి కాలంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పెద్ద మొత్తంలో గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి.



ఘట్‌కేసర్‌లో గంజాయిని రవాణ చేస్తున్న నిందితులను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

మత్తు చిత్తు



వికారాబాద్‌లో ఇటీవల కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పట్టుబడిన గంజాయి, నిందితులు

పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్ వినియోగం, విక్రయం

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) /తాండూరు/వికారాబాద్/పరిగి, జనవరి 17 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో గంజాయి భూతం జడలు విప్పుతోంది. విద్యార్థుల జీవితాలను సైతం మత్తులో ముంచేస్తుంది. గంజాయి ఉచ్చులో 15 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు విద్యార్థులు కొందరైతే.. వేరే రాష్ట్రాల నుంచి కూలిపని చేసుకునే వారు మరికొందరు.. వీరు మత్తుతో పాటు అసాంఘిక కార్యకలాపాల వైపు మొగ్గుచూపుతూ ఉజ్వల భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్న వారు మరికొందరు. మత్తుకు బానిసగా మారిన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా చివరకు వారినే ఏజెంట్లుగా మార్చి చాపకింద నీరులా తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేస్తోంది. డ్రగ్స్‌కు అలవాటు పడినవారు సామాజిక సంబంధాలను కోల్పోతున్నారు.

మత్తులో ఆరోగ్యం చిత్తు

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ శాతం ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. టీబీ, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులతో మంచం పడుతున్నారు. మత్తు పదార్థాలు సరదా కోసం అలవాటు చేసుకుని వాటికి బానిసలై అతి చిన్న వయస్సులోనే వృద్ధులుగా కనిపించేవారు కొందరుంటే.. మరి కొందరు జీవచ్ఛవాల్లా కాలం గడుపుతున్నారు.

రెచ్చిపోతున్న గంజాయి మాఫియా

ఉమ్మడి జిల్లాలో గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. వేర్వేరు రూపాల్లో తన మాఫియాని విస్తరిస్తూ రూ.కోట్లు కూడబెట్టుకోవడంతో పాటు బంగారం లాంటి పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తోంది. ఆకు, సిగరెట్లు, పొడి లిక్విడ్ రూపంలో గంజాయి రవాణ, అమ్మకాలు చేసే మాఫియా దానిని ఇప్పుడు చాక్లెట్ల రూపంలో మార్చి చిన్న పిల్లలకు సైతం గంజాయికి బానిసలుగా మార్చుతోంది. ఈ నెల 10న కొత్తూరులో ఈ ఘటన వెలుగు చూసింది. కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సమీపంలోని పాన్‌షాప్‌లో చాక్లెట్లు కొనుక్కుని తిన్న తర్వాత వారి ప్రవర్తనలో మార్పు రావడం, మత్తులోకి జారుకోవడం, వింతగా ప్రవర్తిస్తుండటంతో అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు కొత్తూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు తనిఖీల్లో 8కిలోల గంజాయి కలిపిన చార్మినార్ గోల్డ్ మునకా అనే పేరుతో ఉన్న 42 చాక్లెట్ల డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.3 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. చాక్లెట్లు తీసుకు వచ్చిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. పబ్బులకే పరిమితమైన గంజాయి మాఫియా పిల్లల వరకు విస్తరించడం కలకలం రేపింది. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్మకాలు చేస్తున్న వారి వెనుక ఉత్తరప్రదేశ్ టు వయా హైదరాబాద్, ఒడిశా కేక ఏంద్రంగా పెద్ద మాఫియా ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైంది

గంజాయి మత్తులో వికారాబాద్

వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతి వార్డులో బెల్టు షాపు ఉందనేది ఎంత నిజమో.. అదే స్థాయిలో గంజాయి సరఫరా అవుతుందనేది కూడా అంతే నిజం. కొన్నేళ్ల క్రితం వికారాబాద్ పట్టణం గరిబ్‌నగర్‌లో ఓ వ్యక్తిని కొందరూ యువకులు గంజాయి మత్తులో కొట్టిన చంపిన విషయం విదితమే. ఈ మధ్య జరిగిన గొడవలు కూడా మద్యం, గంజాయి మత్తులో జరిగినవే ఎక్కువగా ఉన్నాయి. వికారాబాద్ పట్టణంలోయువకులు గంజాయితో పాటు వైట్ నర్ వాడుతున్నట్లుగా తెలుస్తోంది.

కళాశాలలే టార్గెట్

మేడ్చల్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల కాలేజీలను టార్గెట్ చేసుకొని స్మగ్లర్లు ఈ దందా సాగిస్తున్నారు. గతంలో జాతీయ రహదారి పక్కన ఉండే దాబాలు, హోటళ్లలో గంజాయి విక్రయించేవారు. ప్రస్తుతం ఈ వ్యాపారం భారీ ఎత్తున సాగుతోంది. పరిశ్రమలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు, కూలీల్లో ఒడిశా, బిహార్ రాష్ట్రాల వారే ఎక్కువ మంది ఉన్నారు. వారు గంజాయికి అలవాడు పడడంతో ఈ దందా జోరుగా సాగుతోంది. కూలీలకు, డ్రైవర్లకే కాకుండా విద్యార్థులకు, స్థానిక యువతకు డ్రగ్స్ అమ్ముతున్నారు.



ఆదిభట్లలో పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

భారీగా పట్టుబడుతున్న గంజాయి, డ్రగ్స్

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇటీవల కాలంలో డ్రగ్స్, గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడుతోంది. ఈ నెల 11న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర ఎక్సైజ్ అధికారులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.7.50 లక్షల విలువైన 24 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా పలాస, రాజమండ్రి, నర్సీపట్నం, అరకు, ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు గంజాయిని రవాణా చేస్తున్నట్లు పట్టుబడిన నిందితులు ఎక్సైజ్ అధికారుల విచారణలో వెల్లడించారు.
- డిసెంబర్ 14న ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు అంతరాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా రాజమండ్రి నుంచి హైదరాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కి గుట్టుగా సరఫరా చేస్తుండగా పట్టుకున్నారు. యూపీకి చెందిన వికాస్, అక్బర్, అమిరోద్దీన్ నుంచి కోటి రూపాయల విలువైన 360 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబరు 28న రాజేంద్రనగర్‌లో 80 కిలోల గంజాయిని ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు కారులో తరలిస్తుండగా ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు.
- డిసెంబర్ 31న రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.2 లక్షల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. 7.5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి స్వాధీనం చేసుకున్నారు.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డిసెంబరు 22న ఒడిశా నుంచి పూణెకు అక్రమంగా గంజాయి రవాణ చేస్తున్న ఆరుగురు సభ్యుల అంతరాష్ట్ర ముఠాను మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.80 లక్షల విలువ గల 272 కిలోల గంజాయి, రెండు కార్లు, 7సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన యోగేష్‌రాయ్ సింగ్, దినకర్ నరలే, చరణ్‌లాల్‌షిడే, యోగిరాజ్, సంజయ్ మహోత్కర్, చైతన్య తుషార్ తాంటక్, రాహుల్ కాంతిలాల్ పటోకేలు వీటిని సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.
- వికారాబాద్ జిల్లాలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇటీవల పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ట్రైన్‌లో మహారాష్ట్రకి గంజాయి సరఫరా చేస్తుండగా ముగ్గురుని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్, గంజాయి మాఫియాను అరికట్టాలి



రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన డ్రగ్స్, గంజాయి మాఫియాను వెంటనే అరికట్టాలి. ఇటీవలే కొత్తూరు మండలంలో గంజాయి చాక్లెట్లను విద్యార్థులకు అలవాటు చేయాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్, పోలీస్ నిఘా విభాగం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్లు తీవ్రం చేయాలి. డ్రగ్స్ మాఫియా కబంధ హస్తాల నుంచి రేపటి తరం విద్యార్థులను కాపాడాలి. స్కూళ్లు, కాలేజీలు ఎక్కువగా పేదలు నివసించే బస్తీలలలో, వాటి చుట్టుపక్కల ఉండే పాఠశాలల సమీపంలో నిఘా పెంచాలి.

- రఘునందన్, బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

- ఎకరానికి సాలుకు రూ.50వేల పెట్టుబడి
- కొనుగోలుకు వ్యాపారులు నిరాసక్తత



జాడలేని మామిడి పూత

కొండాపూర్‌లోని ఓ తోటలో పూత లేని చెట్లు

దిగుబడిపై తీవ్ర ప్రభావం.. రైతుల దిగాలు



ఘట్‌కేసర్, జనవరి 17 : వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఈ ఏడాది మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రతి సంవత్సరం నవంబరు, డిసంబరులో మామిడి చెట్లు పూతతో నిండి ఉంటాయి. కానీ వాతావరణ మార్పుల కారణంగా సంక్రాంతి పండుగ అయిపోయినా మామిడి చెట్లకు పూత జాడలేదు. ఏ చెట్టు చూసినా ఇగురుగానీ, పూత గానీ లేక వెలవెలబోయి కనిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే మామిడి దిగుబడి ప్రశ్నార్థకంగా మారనుంది. ఘట్‌కేసర్ మండలంలో పలువురు రైతులు దాదాపు 200పైగా ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఇళ్ల వద్ద, వ్యవసాయ బావుల వద్ద భారీ మామిడి వృక్షాలు ఉన్నాయి. సాధారణంగా మామిడి వృక్షాలకు ఎలాంటి సస్య రక్షణ చర్యలు చేపట్టకుండానే సీజన్ వచ్చిందంటే మామిడి పూత విరగ పూసేది. మామిడి రైతులు తోటల్లో చెట్లకు అనేకరకాల సస్యరక్షణ చర్యలు తీసుకుంటూ చెట్లను కంటికి రెప్పలా చూసుకుంటారు. ఐనప్పటికీ ఏ చెట్టుకు పూత జాడలేకపోవటంతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. మామిడి వ్యాపారులు పూత దశలోనే తోటలను కొనుగోలు చేస్తారు. ఈ సంవత్సం పూత జాడ లేకపోవటంతో తోటలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఎకరాకు దాదాపు 140 నుంచి 150 మొక్కలు పెంచగా, పంట చేతికొచ్చే నాటికి రూ.50వేలు పెట్టుబడి ఖర్చు అవుతున్న రైతులు పేర్కొంటున్నారు. తోటల్లో వందల సంఖ్యలో మామిడి చెట్లుండగా ఒకటి రెండు చెట్లు మాత్రమే పూత దశకు వచ్చాయి. పూత పరిస్థితి చూస్తే ఈ సంవత్సం పెట్టుబడైనా చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా డిసెంబరు, జనవరి మాసాల్లో మామిడి పూత వస్తుంది. ఉగాది నాటికి పిందె స్థాయికి ఎదుగుతుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశముంది. కాగా ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సంబంధిత అధికారులు మామిడి తోటలను సందర్శించి ఎలాంటి చర్యలు తీసుకుంటే పూత పరిస్థితి మెరుగ్గా ఉంటుందో అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పూత కనిపించటం లేదు



ఈ సంవత్సరం మామిడి చెట్లకు పూత కనిపించటం లేదు. గతంలో ఇప్పటికే చెట్లన్నీ పూతతో నిండి ఉండేవి. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ ఏ చెట్టుకూ పూత రాలేదు. సంక్రాంతి తర్వాత పూత వచ్చినా పూత నిలిచే అవకాశం తక్కువ. దీంతో మామిడి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ముంది.

- చందుపట్ల చంద్రారెడ్డి, ఘట్‌కేసర్

చలి తీవ్రతతో పూత ఆలస్యం



వాతావరణ మార్పులతో మామిడి చెట్లకు పూత ఆలస్యంగా వస్తుంది. గత సంవత్సరమూ పూత ఆలస్యంగానే వచ్చింది. ఫిబ్రవరి, మార్చి వరకు మామిడి చెట్లకు పూత వచ్చే అవకాశం ఉంది. మామిడి తోటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పిస్తున్నాం. చలి తీవ్రత అధికంగా ఉండటంతోనే పూత ఆలస్యంగా వస్తుంది.

- రేణుక, హార్టికల్చర్ అధికారి, ఘట్‌కేసర్



పూత లేని చెట్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

అన్ని సౌకర్యాలు కల్పించాలి » సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూంల పనులను త్వరితగతిన పూర్తిచేసి అర్హులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ గౌతం అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, అర్ అండ్ బీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్‌రూంల ఇళ్ల ను అర్హులకు అందజేశారు. అసంపూర్తిగా ఉన్న వాటి పనులు ఏలా జరుగుతున్నాయి, ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూంలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జిల్లాలో డబుల్‌బెడ్ రూంల పంపిణీలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకొని, అందుకు అసరమైన సలహాలు, సూచనలు తెలియజేశారు. జిల్లాలోని అయా మున్సిపాలిటీలు, మండలాల వారీగా మంజురైన లబ్ధిదారులకు అందజేయాల్సిన డబుల్‌బెడ్ రూంల గురించి జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, అర్డీవోలు, జీహెచ్‌ఎంసీ అధికారులు, అయా మండలాల తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి నోము

» ముగిసిన ధనుర్మాసవ్రత పూజలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న పండితులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి17: ఎదులాబాద్ గోదాసమేత శ్రీ మన్నార్ రంగనాయకస్వామి ధనుర్మాసవ్రత పూజలు గోదాదేవి నోముతో ముగిశాయి. పండితులు మంగళవారం రాత్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గోదాదేవిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపంలో అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కోలాటం ఆడారు. శ్రీమన్నారాయణ నామస్మరణతో ఆలయప్రాంగణమంత మార్మోగింది. అమ్మవారికి నోము నిర్వహించి ధనుర్మాసవ్రత పూజలను ముగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలచార్యులు, సేనామాచార్యులు, పురుషోత్తచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, హరికృష్ణాచార్యులు, అధిత్యాచార్యులు, శ్రీవాస్తవాచార్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నోము కార్యక్రమంలో కోలాటం ఆడుతున్న మహిళలు

మేడ్చల్ పీఎస్‌ను తనిఖీ చేసిన సైబరాబాద్ సీపీ

మేడ్చల్ టౌన్, జనవరి 17: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌ను సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. విధుల నిర్వహణపై అడిగి తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పనితీరును తెలుసుకున్నారు.



మేడ్చల్ పీఎస్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

» మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి

వికారాబాద్/తాండూరురూరల్, జనవరి 17: వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఐదు నుంచి వివిధ తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరక దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 6 గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్‌టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏ.సీజీజీ.జీవోవీ.ఐఎన్ ద్వారా లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9959746436కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. వికారాబాద్ బాలుర 1, పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఫకీరా రాత్లావత్‌ను సంప్రదించవచ్చని సూచించారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, బోనోఫైడ్, పాస్‌ఫొటో సైజ్ ఫొటోలతో తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి సమీపంలోని మైనార్టీ గురుకులం పాఠశాలకు వస్తే ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామని ప్రిన్సిపాల్ గంగయ్య వివరించారు. వివరాలకు 8978671075, 6305147525 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత కొడంగల్ జట్టు



కబడ్డీ పోటీల్లో విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, జనవరి 17: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మూడు రోజులుగా కొడంగల్ పట్టణంలోని ఎస్బీఐ బ్యాంకు ముందు సిటిజన్ క్లబ్ ఆవరణలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొనగా బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొడంగల్, ఎరన్‌పల్లి జట్లు తలపడ్డాయి. చివరగా కొడంగల్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కొడంగల్ జట్టుకు రూ.50వేలు, రన్నరప్‌గా నిలిచిన ఎరన్‌పల్లి జట్టుకు రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ జట్టుకు రూ.20వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన కొడంగల్ గోల్డెన్ బేకరి జట్టుకు రూ.10వేలు నగదుతో పాటు ట్రోఫీలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఏనుగుల భాస్కర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నయీం, నాయకులు భీమారాజ్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్, సీఐ రాములు, ఎస్ఐ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి, జనవరి 17: కుత్బుల్లాపూర్‌లో గల అల్విన్‌కాలనీలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వకర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని శిక్షించడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్, విశ్వకర్మ సంఘం జిల్లా కన్వీనర్ వెంకటచారి, నాయకులు జి.గంగాధర్, చందు, నవీన్‌చారి, అనిల్‌కుమార్, భీయయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.



వికారాబాద్‌లో ప్రారంభమైన బ్రిడ్జి పనులు

ఎట్టకేలకు బ్రిడ్జి పనులు ప్రారంభం

వికారాబాద్, జనవరి 17: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వికారాబాద్ ప్రధాన బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో వికారాబాద్ హైదరాబాద్ రోడ్డును కలిపి ఉన్న ఏకైక బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించుకునేందుకు రూ.96కోట్లు మంజూరు చేసింది. అయితే ఎన్నికలు రావడంతో ఆ పనులు ప్రారంభం కాకుండానే ఆగిపోయాయి. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో మట్టితో బ్రిడ్జిని నిర్మించారు. అయితే అది ఇప్పుడు కృంగిపోయి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త బ్రిడ్జి మంజూరైతే బాగుంటుందని అనుకున్న సమయంలో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అట్టి పనులు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి పక్క నుంచి పనులు ప్రారంభించి మొదటగా ఒక వరుస బ్రిడ్జిని పూర్తి చేయనున్నారు. అనంతరం పాత బ్రిడ్జిని కూలగొట్టి అనంతరం అక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయనున్నట్లుగా తెలుస్తోంది. కొత్త బ్రిడ్జి నిర్మాణంలో ప్రస్తుత ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కృషి ఎంతగానో ఉంది. కొత్త ప్రభుత్వంలో ప్రస్తుత ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్ చొరవతో బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

ప్రజలు సమయ స్ఫూర్తితో వ్యవహరించాలి

» జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్(జాతీయ విపత్తు ప్రతిస్పందన ఫోర్స్) ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రదర్శనలు చేసి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి సమయస్ఫూర్తితో వ్యవహరించాలని, అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు పడొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ దామోదర్ సింగ్, ఇన్‌స్పెక్టర్ గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపుతున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

పేదల గుడిసెలపై ప్రభుత్వ దౌర్జన్యం

» సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్

వికారాబాద్, జనవరి 17: పేదల గుడిసెలపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ ఆరోపించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లా కేంద్రంలో వీరనారి ఐలమ్మనగర్‌లో ఆరునెలలుగా పేద కార్మికులు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని పట్టాలివ్వాలని పోరాడుతున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీన తెల్లవారుజామున 3గంటలకు వందలాది మంది పోలీసులు వచ్చి బుల్డోజర్లతో గుడిసెలను కుల్చారన్నారు. ఈ క్రమంగా అరెస్టయిన నాయకులను విడుదల చేయాలని కోరారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనూ నాయక్, సుదర్శన్, శంకర్, నర్సింహులు, అనంతయ్య, ఆకాష్ రాజు, వెంకట్ రాములు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: దుద్యాల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న బుస్స చంద్రయ్య

బొంరాస్‌పేట్: పేదల గుడిసెలపై రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యం నశించాలని సీపీఎం వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. దుద్యాల మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాములు, వెంకటయ్య, మొగులయ్య, సాయిలు, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిగి: జగిత్యాల జిల్లాలో సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అక్రమ కేసులు పెట్టినవారిపై ఎత్తి వేసి బేషరుతుగా విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ హబీబ్, సత్య రఘురాం, రాంచంద్రయ్య, రమేశ్, వెంకటయ్య ప్రశాంత్, నర్సింహా పాల్గొన్నారు.



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

» మాప్రభుత్వం సంపదను సృష్టిస్తుంది

» గ్యారంటీ పథకాలను అమలు చేస్తుంది

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జనవరి 17: ధనికరాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ ఆరుగ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సంపదను సృష్టించే కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ పూర్తిగా పడిపోయిందని, తమ ప్రభుత్వం ప్రాజెక్టుకు తిరిగి పూర్వవైభవం తీసుకువస్తుందని చెప్పారు. 9200 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్నారు. చేపట్టిన ప్రాజెక్టులో ఇప్పుడు 3వేల ఎకరాల వరకు మాత్రమే నీటిని అందించగలుతుందన్నారు. ప్రాజెక్టు ఆధునీకరణ, కాల్వల మరమ్మతులకు సుమారు రూ.135కోట్లు కావచ్చని అంచనా వేశారు. ఆయకట్టు చివరి పొలానికి కూడా నీటిని అందిస్తామన్నారు. బోరుమోటర్ల కోసం డీడీలు కట్టి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్న రైతులందరికీ తప్పకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పిస్తానని అన్నారు. ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ.. ప్రతీ సమావేశంలో సమస్యలు చెప్పడమే కాని అవిపరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు.

గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే సీరియస్

పెద్దేముల్ మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలి కొదిలేస్తే సంహించనని అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి తప్పని సరిగా అన్నిశాఖల అధికారులు రావాలని ఆదేశించారు. 'తమాషాలు చేస్తున్నారా..? ఇలా అయితే ఊరుకునేది లేదు..' అంటూ మండిపడ్డారు. ఆర్అండ్‌బీ అంశం చర్చకు వచ్చినపుడు అధికారికి బదులుగా సిబ్బంది రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలకు రాకుండా, ప్రజాసమస్యలు గాలికి వదిలేసినా సహించేది లేదని అన్నారు. తమాషాలు చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. కాగా, విద్యుత్ సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఫిర్యాదులు చేశారు. తాము పదవి చేపట్టిన నాటినుంచి సమస్యలపై సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలు తెస్తూనే ఉన్నామని, అవి పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని సర్పంచ్‌లు రేగొండి శ్రవణ్‌కుమార్, హైదర్, చంద్రప్పలు వివరించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లో తిరిగి ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల అంశంపై తహసీల్దార్ మాట్లాడగా ఒక డీలర్‌షాపు కింద ఎన్ని రేషన్‌కార్డులు ఉండాలని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎంతమంది డీలర్లు ఉన్నారు. ఎక్కడైనా డీలర్లు అవసరమా? వాటిని గుర్తించి తనకు నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సర్పంచ్ హైదర్ కోరగా అందరి సహకారంతో ఇసుక అక్రమ రవాణాను అరికడదామని ఎమ్మెల్యే అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రత్యేకాధికారులా.. పర్సన్ ఇన్‌చార్జిలా?



తుమ్మలపల్లి గ్రామ పంచాయతీ భవనం

» ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

» ఇప్పట్లో జీపీ ఎన్నికలు లేనట్టే!

చౌదరిగూడ, జనవరి 17: పంచాయతీల సర్పంచుల పదవీ కాలం మరో 18 రోజుల్లో ముగియనుంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇప్పట్లో జీపీ ఎన్నికలు నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది స్పష్టమవుతోంది. మూడు నెలల్లో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలపై గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రభావం చూపే అవకాశాలున్నాయని, కావున ఈ ఎన్నికలను వాయిదా వేయడమే మంచిదని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. జీపీ పాలక మండళ్ల పదవీ కాలం ముగిస్తే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన విధించడమో లేక ప్రస్తుత సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించడమో చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005, 2011లలో పంచాయతీల పాలక వర్గాల పదవీకాలం ముగిశాక, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు తెరలేపింది.

ఎన్నికలపై ప్రకటన చేయని ప్రభుత్వం

పంచాయతీ ఎన్నికలపై కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. సర్పంచ్‌గా పోటీ చేద్దామనుకున్న వారి ఆశలు నీరుగారుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి గ్రామాన్ని అభివృద్ధి చేద్దామనుకున్న వారు నిరాశలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున.. పంచాయతీ ఎన్నికల్లో ఒకరికి మద్దతిస్తే మరి కొందరు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉన్నందున, ఈ ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడే అవకాశం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపై దృష్టిపెట్టలేదని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

రిజర్వేషన్లపై నెలకొన్న సందిగ్ధం

రాష్ట్రంలో 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించారు. మొదటి విడత జనవరి 21న, రెండో విడత జనవరి 25న, మూడో విడత జనవరి 30న నిర్వహించారు. ఫిబ్రవరి 2న సర్పంచ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. పంచాయతీలకు ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తారు. గత ప్రభుత్వం చట్టసవరణ చేసి స్థానిక సంస్థల్లో పదేళ్లకోసారి రిజర్వేషన్లను సవరించాలని నిర్ణయించింది. ఈ నిబంధన ప్రకారం గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లనే ఇప్పుడూ అమలు చేయాలి. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లను కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదు. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగుయనుంది. 3నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున్న పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కొత్తగా రిజర్వేషన్లు ప్రకటించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయంతో ప్రభుత్వం ఉందని సమాచారం.

పంచాయతీల పాలన ఎవరికి?

ఇప్పట్లో పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశం లేనందున ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో పాలన ప్రత్యేక అధికారుల చేతికా? లేక పర్సన్ ఇన్‌చార్జిలకా అనేది చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రభుత్వం త్వరలోనే ఓ విధానాన్ని ప్రకటించనుంది. జీవో113 ప్రకారం పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుంటే ప్రత్యేకాధికారులు గానీ లేదా తాజా మాజీ సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించే అధికారం ప్రభుత్వానికి ఉంది. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన నియమిస్తే పరిపాలన సాఫీగా సాగే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడానికి కొత్త ప్రభుత్వం సుముఖత చూపదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే సర్పంచుల్లో ఎక్కువ శాతం మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందాలంటే పంచాయతీల పాలన అధికారులకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

అధికారుల పాలనకు కసరత్తు

గ్రామ పంచాయతీల పాలనకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్ఐ, ఎంపీవో, ఎంఈవో, ఈజీఎస్, సర్వేయర్లు, ఐకేపీ సిబ్బందిని ప్రత్యేకాధికారులుగా నియమించే పనిలో పంచాయతీరాజ్ అధికారులున్నారు.

ఈనెల 30వరకు జంతు సంరక్షణ

పక్షోత్సవాలు

వికారాబాద్, జనవరి 17: దేశ వ్యాప్తంగా జంతు సంరక్షణ పక్షోత్సవాలు ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా పశు వైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జంతు హింసకు పాల్పడకుండా కరుణతో ఉంటూ వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జంతు సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలని కోరారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని, వన్యప్రాణులు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చి వాటిని సురక్షిత అటవీ ప్రాంతానికి తరలించాలన్నారు. పక్షులు ఆవాసాలైన వృక్షాలను నరికివేయొద్దని సూచించారు. జామూన్, వేప, రావి ఇతర మొక్కలను నాటాలన్నారు. పెంపుడు జంతువులను హింసకు గురిచేయొద్దన్నారు. పెంపుడు జంతువులను సంతాన అభివృద్ధి (బ్రీడింగ్)చేయడం ద్వారా వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా జంతు సంరక్షణ బోర్డు నుంచి అనుమతులు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అదే విధంగా ప్లాస్టిక్‌ను నిషేధించి జంతువులు అవి తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన, పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీన ప్రతీ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని తెలిపారు.

తెలంగాణ సాంస్కృతిక చరిత్ర నిర్మాణంలో

సారస్వత పరిషత్తు ఎనలేని కృషి

» తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

» వికారాబాద్ జిల్లా సమగ్రస్వరూప గ్రంథాన్ని ఆవిష్కరించిన డీపీవో తరుణ్

వికారాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తితో తెలంగాణ సాంస్కృతిక చరిత్రను నిర్మించడంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అవిశ్రాంతంగా కృషి చేస్తోందని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. తెలుగు భాష, తెలంగాణ సాంస్కృతిక చరిత్ర నిర్మాణానికి సారస్వత పరిషత్తు చేస్తున్న కృషి అందరి అభినందనలు అందుకుంటోందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం తదితర అనేక అంశాలపై ప్రచురిస్తున్న గ్రంథాల పరంపరలో భాగంగా రూపొందించిన వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూప గ్రంథావిష్కరణ సభ బుధవారం రాత్రి అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శివారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటి వరకు 15 జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు పూర్తయ్యాయన్నారు. మరో ఐదు జిల్లాల చరిత్ర, సంస్కృతి గ్రంథాలు తుది దశలో ఉన్నాయని, ఈ గ్రంథాలు పూర్తయితే ఇతర రాష్ట్రాల వారు అసూయ చెందడం ఖాయమన్నారు ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్ పరిషత్తు ముఖ్యబాధ్యులతో కలిసి వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో జన్మించడం పూర్వజన్మ సుకృతమన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ, నిజాం పరిపాలన కాలంలో పెద్దలు ఏర్పాటు చేసిన సారస్వత పరిషత్తు తెలుగు భాషను నిలిపేందుకు అనేక కష్టనష్టాలు అనుభవించిందని, దాని ఫలితమే తెలంగాణలో కనిపిస్తున్న తెలుగు వికాసమన్నారు. గ్రంథం రూపకల్పనలో కన్వీనర్‌గా వ్యవహరించిన డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ తిరునగిరి దేవకీ దేవి, ఎంపీడీవో ఎం.సత్తయ్య, అనంతసాహితీ సమితి ప్రతినిధి రాఘవేంద్ర చారి, డాక్టర్ ఎం.అంజయ్య అవధాని తదితరులు పాల్గొన్నారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న డీపీవో తరుణ్

వైభవంగా వెంకిర్యాల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొందుర్గు, జనవరి 17: మండల పరిధిలోని వెంకిర్యాల శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో.. మూడో రోజైన బుధవారం ఉదయం 5.30 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. స్వామివారికి పల్లికిసేవ నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గల మైసమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను తిప్పి భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. మైసమ్మ తమను చల్లగా చూడాలని కోరుకున్నారు. సాయంత్రం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జాతరలో పాల్గొని దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి జాతరకు హాజరై ప్రత్యేకపూజలను చేశారు. వెంకిర్యాల, విశ్వనాథ్‌పూర్, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్‌లు లింగమయ్య గౌడ్, శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, ఈవో శ్రీనివాసశర్మ, నాయకులు కృష్ణారెడ్డి, రాజు, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, బి.నరేందర్, వజ్రమ్మ, ఆంజనేయలు, యాదయ్య, మానయ్యగౌడ్, నర్సింలు, గోవింద్, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు



మైసమ్మ ఆలయం చుట్టూ ట్రాక్టర్లను తిప్పుతున్న భక్తులు



ఎడ్లబండిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

దుంగల దొంగలు దొరికేదెన్నడు?

» రైతుల పొలాల నుంచి 'శ్రీగంధం' చెట్లు అపహరణ

» వరుస ఘటనలతో రైతులకు రూ.కోటి వరకు నష్టం

» రాత్రిళ్లు పొలాల వద్దకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు



గడ్డమల్లాయగూడలో దుండగులు నరికేసిన శ్రీగంధం చెట్టు(ఫైల్)

యాచారం, జనవరి 17: మండలంలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో నెల రోజుల వ్యవధిలో రైతులు పెంచిన రూ.కోటి విలువైన శ్రీగంధం చెట్లను దుండగులు నరుక్కొని అపహరించుకు పోతుండడంతో రైతులు రాత్రిళ్లు తమ పొలాలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. దుంగల దొంగలు స్థానికులా, దూరా ప్రాంతాల నుంచి వస్తున్నారా? అనేది తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. దొంగలు పగటిపూట బిక్షాటన చేస్తూ, పొలాల వద్ద కెళ్లి కంజు పిట్టలను పట్టేవారిలా, రియల్టర్లలా నటిస్తూ శ్రీగంధం చెట్లు పెంచుతున్న జాత తెలుసుకుంటూ అర్ధరాత్రి నరికి వేస్తూ ఎత్తుకెళుతున్నట్లు తెలిసింది. శ్రీగంధం చెట్లను దొంగలు అపహరించుకుపోవడంతో రైతులు బోరునవిలపిస్తున్నారు. 20ఏళ్లుగా పెంచిన చెట్లపై పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారిపోయాయని వాపోతున్నారు. మరో ఐదేళ్లపాటు పెంచితే ఒక్కో చెట్టుకు రూ.5లక్షలు వచ్చేవని రైతులు చెప్పారు.

పొలాల్లో పదుల సంఖ్యలో చెట్ల నరికివేత!

గతంలో మాజీ సర్పంచ్ జి.సురేందర్‌రెడ్డి పొలంలో ఏడు శ్రీగంధం చెట్లు, అంజిరెడ్డి, అచ్చన పర్వతాలు, కమలాకర్‌రెడ్డి పొలాల్లో ఒక్కోటి చొప్పున నరుక్కపోయారు. అలాగే చౌదర్‌పల్లిలో ఇద్దరు రైతుల పొలాల్లో నాలుగు శ్రీగంధం చెట్లను నరుక్కపోయారు. ఇటీవల గడ్డమల్లాయగూడలో రైతు భోజిరెడ్డి పొలంలో 2, చంద్రయ్య పొలంలో 4 చెట్లు, రాజశేఖర్‌రెడ్డి పొలంలో 3, వెంకటరెడ్డి పొలంలో 1, రాకేష్‌రెడ్డి పొలంలో 2, యాదగిరి పొలంలో 3 చొప్పున శ్రీగంధం చెట్లను దుండగులు నరికి ఎత్తుకెళ్లారు. అచ్చన వెంకటయ్య అనే వ్యక్తికి చెందిన మూడు గొర్రెలు, రెండు పొట్టేళ్లను సైతం ఎత్తుకెళ్లారు. అలాగే గున్‌గల్‌లో భూషయ్యగౌడ్ పొలంలో ఏపుగా పెరిగిన శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లారు.

బైక్‌లపై వస్తూ చెట్ల అపహరణ?

దుండగులు రాత్రివేళ గోప్యంగా బైక్‌లపై వచ్చి శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లారు. నరకడానికి ఆలస్యం కాకుండా అత్యంత పదునైన గొడ్డళ్లను, పెట్రోల్‌తో నడిచేకట్టర్లను ఉపయోగించారని తెలుస్తోంది. దొంగల వద్ద మారణాయుధాలు ఉంటుండంతో రాత్రయిందంటే పొలాల వద్ద ఉండాలంటే రైతులు భయపడుతున్నారు. చెట్ల కోసం వచ్చిన వారిని తాము అడ్డుకుంటే చంపేందుకు సైతం వెనకాడరని రైతులు జంకుతున్నారు. దీంతో శ్రీగంధం చెట్లు ఉన్నా వాటిని కావాలి వెళ్లేందుకు రైతులు వెనకాడుతున్నారు. అయితే దుండగులు స్థానికులే అయి ఉంటారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు కాకుంటే తాము శ్రీగంధం చెట్లు పెంచుతున్నాం అనే విషయం వేరే వారికి ఎలా తెలుస్తుందని అనుమానిస్తున్నారు. దుండగుల కోసం యాచారం పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి శ్రీగంధం ముక్కలను కొనుగోలు చేసే వ్యాపారుల దుకాణాలపై నిఘా వేశారు. ఈ విషయంపై యాచారం సీఐ సైదయ్యను వివరణ కోరగా క్రైం పోలీసులతో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దుంగల దొంగలపై మాడ్గుల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల, కడ్తాల, నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి, నగర శివారు పోలీసులకు సమాచారమందించి దుండగుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. దుండగులు సెల్‌ఫోన్ మాట్లాడారా.. ఏయే వాహనాల్లో దుంగలను తరలించారనే వివరాలను ఆరా తీస్తున్నట్లు చెప్పారు. కాల్‌డేటాను సేకరిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని ఆయన ప్రజలను కోరారు.

ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వం మాది



తాండూరు: ఆధార్ సెంటర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జనవరి 17: తాండూరు పట్టణం పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి సందర్శించారు. బుధవారం ప్రారంభించిన మూడు ఆధార్ కేంద్రాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ఆధార్ కేంద్రం ఆపరేటర్లతో మాట్లాడుతూ రోజుకు ఎంత మందికి అప్‌డేట్ చేస్తున్నారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని ఎమ్మెల్యే ఆరా తీశారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న తాండూరుకు వికారాబాద్ జిల్లా తాండూరు అనుసంధానం కావడం వల్ల ఇబ్బందులున్నాయని ఆపరేటర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడికక్కడే ఫోన్‌లో సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరగా ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇంకా అవసరమైతే ఆధార్ కేంద్రాలు పెంచుతామని, కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజల కష్టాలు తీర్చే ప్రభుత్వమని మీడియాతో వ్యాఖ్యానించారు. టోకన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు రత్నమాల, నీరజ, ప్రభాకర్ గౌడ్, తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు హబీబ్ లాల, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు తదితరులున్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తాం

గత పది సంవత్సరాలు విద్యావ్యవస్థకు పూర్తి నష్టం వాటిల్లిందని దాన్ని సవరించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే అన్నారు. విద్యాశాఖను ఎస్‌సీఆర్‌టీని పూర్తి ప్రక్షాళన చేస్తామన్నారు. రాష్ట్రంలో 317 జీవోతో నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపేందుకు తెలంగాణ రాష్ట్రం యోచిస్తోందన్నారు. అవసరమైతే జిల్లాలను శాస్త్రీయంగా పునర్విభజన చేస్తామన్నారు. తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ తాండూరు డివిజన్ క్యాలెండర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అసలు ప్రభుత్వం విద్యను పూర్తిస్థాయిలో నిర్లక్ష్యానికి గురి చేస్తూ గాలికి వదిలేసిందని, విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రక్రియను రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్షాళన చేసే దిశగా పనులు ప్రారంభించిందన్నారు. రాబోయే ఐదారు మాసాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్‌వికారాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ఉపాధ్యక్షులు మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ.. విద్యాపరంగా వికారాబాద్ జిల్లా పూర్తిగా నిరాధరణకు గురైందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షులు నర్సింహులు, తాండూరు మండల అధ్యక్షులు నారాయణగౌడ్, వెంకటప్పలు, యాలాల మండల భానుచైతన్య, బొంరాస్‌పేట అధ్యక్షుడు గౌరారం గోపాల్, హెచ్ఎం నర్సానాయక్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు మహేందర్, గోవర్ధన్, కిష్టప్ప, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్, నాయకులు రామచందర్, మియా మహిళా నాయకులు సువర్ణ రాణి, మానెమ్మ, మంజుశ్రీ, శాంత పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

బషీరాబాద్: తాండూరులోని ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో యూత్ ప్రభంజనం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యువత సమాజ సేవలో ముందుండటం అభినందనీయమని కొనియాడారు. ఈకార్యక్రమంలో పెద్దేముల్ జడ్పీటీసీ ధారసింగ్, తాండూరు టౌన్ ప్రెసిడెంట్ హబీబ్‌లాల, రవిగౌడ్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

దోమ, జనవరి 17: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళా మృతి చెందిన ఘటన దోమ మండలంలోని దాదాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామానికి చెందిన డప్పు బాబమ్మ (35) దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్ గ్రామంలో తన అత్తగారి ఇంటికి ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ నడిపిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

చైనా మాంజాతో వ్యక్తికి గాయాలు



అమీర్

వికారాబాద్, జనవరి 17: నిషేధిత చైనా మాంజా ప్రజల ప్రాణాలకు సంకటంగా మారింది. సంక్రాంతి పర్వదినాన ఎక్కడ చూసినా పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పతంగులు ఎగురవేసేందుకు చైనా మాంజా వినియో గిస్తున్నారు. దీంతో అది కాస్త ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. తాజాగా, వికారాబాద్‌లో ఓ లాడ్జిలో పనిచేసే అమీర్ అనే వ్యక్తి గొంతుకు మాంజా కోసుకుని తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో స్థానికులు హుటాహుటిన అతన్ని ఆసుపత్రిలో చికిత్స అందించారు. దీంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సంక్రాంతి పండుగ వేళ చైనా మాంజా విషయంలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకుని వాటిని అమ్మకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పెద్దేముల్, జనవరి 17: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన బక్కని రాములు(48) నాగసమందర్ పశువైద్యశాలలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీన విధులు ముగించుకుని టీవీఎస్ ఎక్సల్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో గాజీపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా బైక్‌పై ఉన్న వ్యక్తులు బాల్‌రాజ్‌తో పాటు పవన్‌రెడ్డిలు బక్కని రాములుపై దాడిచేసి కొట్టారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయనకు మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ తరలించి అక్కడ చికిత్సలు చేయించారు. బుధవారం ఉదయం ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకురాగా ఇంటివద్ద సాయంత్రం మృతి చెందాడు. ఈమేరకు మృతుడి తమ్ముడు సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దాడిచేసిన బాల్‌రాజ్, పవన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

ఘట్‌కేసర్‌లో ఆపరేషన్ ముస్కాన్

- బాలల సంరక్షణ కేంద్రానికి ఏడుగురు బాలకార్మికుల తరలింపు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 17: ఏడుగురు బాలకార్మికులను గుర్తించి బాలల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని పలుదుకాణాలపై బుధవారం పోలీసులు, ఆపరేషన్ ముస్కాన్ బృందం(బాలల బాధ్యత సంస్థ) సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఈ ఆపరేషన్‌లో ఏడుగురు బాలకార్మికులను గుర్తించారు. బాలకార్మికులతో పనులు చేయిస్తున్న పెట్రోల్‌బంక్, మెకానిక్, చాయ్, చిల్లర దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశారు. బాలకార్మికులను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 17: తమ ప్లాట్లలో నిర్మాణాలను తొలగించి కబ్జాకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ల యజమానులు ప్రతాప్‌సింగారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ప్రతాప్‌సింగారం రెవెన్యూ పరిధి సర్వేనంబర్లు 315, 316, 317లలో 1988లో అదేగ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తాము కొనుగోలు చేసి 90ప్లాట్లను మలిపెద్ది మధుసుధన్‌రెడ్డి కబ్జాచేసి ప్రహరీ నిర్మించాడని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ల యజమానులు సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, నర్సింగ్‌రావు, మహేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, సుదర్శన్ రావు, శ్రీధర్ తదితరులు కోరారు.

గిర్మాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం



రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్యులు

మేడ్చల్ టౌన్, జనవరి 17: మండలంలోని గిర్మాపూర్ గ్రామంలో మెడిజిటీ ప్రైవేట్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ వంకటి లావణ్య హనుమంత్‌రెడ్డి ప్రారంభించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు బీజకుట్ట, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచి సమస్యలు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. రోగ నిర్ధారణ అనంతరం 35 మందికి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ డాక్టర్లు ప్రణవ్, మృనాలిని, అవంతిక, విజ్ఞావాసిరెడ్డి, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

రత్నమాల కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



సర్పంచ్ రత్నమాల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 17: మండలంలోని జినుగుర్తి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల రత్నమాల కుటుంబాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రత్నమాల భర్త, మాజీ సర్పంచ్ పట్లోళ్ల ఏసిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ బుధవారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుమారుడు, మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డికి ఎమ్మెల్సీ మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మన్ రవి గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, శేఖరయ్య, శ్రీనివాస్‌గౌడ్‌లు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



చౌడాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న బందెయ్య

కులకచర్ల, జనవరి 17: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందెయ్య తెలిపారు. చౌడాపూర్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్, ఉచిత రేషన్ బియ్యం, ముద్ర రుణాలు, పీఎం జీవనజ్యోతి, సురక్ష యోజన పథకం, ప్రతీ సంవత్సరం రూ.342 చెల్లించడంతో రూ.2లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10లక్షలు, అదేవిధంగా ప్రతీ రైతుకు ఏడాదికి రూ.6వేలు, ముఖ్యంగా మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సతీశ్, సర్పంచ్ రంగారెడ్డి, రాజరెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 17: ప్రభుత్వం ఉపాధి కల్పన శాఖ ద్వారా నిరుద్యోగ యువత భారీగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పరిగిలో తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డితో కలిసి విలేఖరులతో మాట్లాడారు. పరిగిలో నెల 23న మెగాజాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. జీఎంఆర్,హెటిరో, అపోలో లాంటి 50 కంపెనీలలో 6500 ఉద్యోగాలు ఇచ్చే విధంగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్‌సీ తరహాలో టీఎస్‌పీఎస్‌సీ బోర్డును బలోపేతం చేసి ఉద్యోగాల కల్పన చేపడుతుందని తెలిపారు. పాలకవర్గం కూడా పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. త్వరలోనే గ్రూ-1, గ్రూపు-2 తదితర నోటీఫికేషన్‌లు వేయబోతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, వివిధ ప్రైవేట్ రంగాల్లో కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం గ్రూపు-1 పరీక్ష నిర్వహించలేక విఫలమైందని విమర్శించారు. 40 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం పట్ల ప్రజలంతా ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఫిబ్రవరిలో తాండూరులో జాబ్ మేళా నిర్వహించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఉపాధి కల్పన శాఖ ప్రాంతీయ అధికారిణి భవాని మాట్లాడుతూ, టెన్త్ నుంచి పీజీ వరకు డిగ్రీ,పీజీ, బిటెక్, ఐటీఐ, డిప్లోమా లాంటి కోర్సులు చదివిన ప్రతి ఒక్కరూ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యం లేని వారికి శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ,పి.రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీపీఎం ఉద్యోగుల సన్మానం

తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పరిగిలోని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సీపీఎస్ ఉద్యోగులు సన్మానించారు. సీపీఎస్ రద్దు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి ఓపీఎస్ అమలు చేసే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. 2లక్షల 20వేల మంది సీపీఎస్‌పై ఆశలు పెట్టుకున్నారని, ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. కచ్చితంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేసే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు పి.అనిల్, బి.నరేందర్, రాష్ట్ర కార్యదర్శులు దర్శన్‌గౌడ్, మురహరి, పరిగి మండల బాధ్యులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, నర్సింహా, ఇసాక్, లక్ష్మీనర్సింహులు, భీయయ్య ఉన్నారు.

పోచమ్మ దేవత పూజల్లో ఎమ్మెల్యేలు

దోమ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన పోచమ్మ దేవత పూజల్లో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, బుయ్యాని మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటలతో పాటు జీవితంలోనూ గెలవాలి



క్రికెట్ టోర్నీ విజేతలతో మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ యువనాయకుడు, తదితరులు

బషీరాబాద్, జనవరి 17: యువకులు ఆటలతో పాటు జీవితంలోనూ గెలవాలని బషీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ ఎస్.వెంకటేష్, కాంగ్రెస్ యువనాయకుడు ఎం.రోహిత్ మహరాజ్ అన్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలో నాలుగు రోజుల పాటు ఎంఎన్ఆర్, బీఎంఆర్ ఆధ్వర్యంలో కొనసాగిన సర్కిల్ కికెట్ టోర్నీలో 30జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీ బుధవారం ముగిసింది. బాజీగర్, ఓల్డ్‌ఐస్ యంగ్‌టీంల మధ్య ఫైనల్ పోటీ రసవత్తరంగా కొనసాగింది. ఫైనల్ మ్యాచ్‌లో బాజీగర్ టీం విన్నర్‌గా నిలువగా, ఓల్డ్‌ఐస్ యంగ్ టీం రన్నర్ విజయం సాధించింది. అనంతరం వారు విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్డే శ్రీను, కాంగ్రెస్ నాయకులు పవాన్‌ఠాగూర్, సాయిల్‌గౌడ్, వార్డు మెంబర్ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్రాంతి పథకంలో అవకతవకలు

- ఆలస్యంగా వెలుగులోకి
- ఏపీఎంకు మహిళా సంఘం ఫిర్యాదు



ఏపీఎం సురేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న మోత్కూర్ మహిళా సంఘం సభ్యులు

దోమ, జనవరి 17: మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకంలో అవకతవకలు జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని మోత్కూర్ గ్రామ పంచాయతీలో బుక్ కీపర్‌గా విధులు నిర్వహిస్తున్న కటికె మల్లేశం శివశ్రీ మహిళా సంఘానికి ఆగస్టు 30, 2022లో రూ.7లక్షల 50వేల రుణం మంజూరైతే రూ.5లక్షలు ఇచ్చి రెండు లక్షల 50వేలు మహిళల ఖాతాల్లో జమఉంటాయని చెప్పి తన ఖాతాలో జమచేయించుకున్నాడు. శివశ్రీ సంఘం సభ్యులు బుక్‌కీపర్‌ను నిలదీయగా తన అవసరం నిమిత్తం డబ్బులు వాడుకున్నానని తర్వాత మీకు ఇస్తానని కాలయాపన చేశాడు. దీంతో సంఘం సభ్యులు బుధవారం దోమ మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో ఏపీఎం సురేశ్‌కు ఫిర్యాదు చేశారు.

ఏపీఎంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

పెద్దేముల్, జనవరి 17: ఐకేపీ ఏపీఎం తన ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, అధికారులు ఒంటెద్దు పోకడ మంచిది కాదని వైస్ ఎంపీపీ మధులత ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దేముల్ మండల సర్వసభ్య సమావేశంలో బుధవారం మాట్లాడుతూ పొదుపుసమాఖ్య సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినా వైస్ ఎంపీపీనైన తనకు సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు, పంపిణీ కార్యక్రమాలు జరుపుతున్నారని చెప్పారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఆయనకు గౌరవం లేదనిపిస్తోందని అన్నారు. మహిళల పట్ల గౌరవం లేని అధికారి మహిళా సంఘాలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఇక నుండైనా మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవ ఇవ్వడం నేర్చుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



బహదురపూర ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

మోమిన్‌పేట్, జనవరి 17: మండల కేంద్రంలోని సూపర్ డీలక్స్ ఫంక్షన్ హాల్‌లో బహదూరపూర ఎమ్మెల్యే మొహ్మద్ ముబీన్‌ను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. మోమిన్‌పేట వాసి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నర్సింహులుగుప్త, వికారాబాద్ జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, సర్పంచ్ అంగెరి శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ సమద్, రవూఫ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, సుభాష్‌గౌడ్, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయులు ఎస్.నారాయణరెడ్డి, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీశైలం వెళ్ళే భక్తుల కోసం అన్నదానం చేస్తున్న సాయిపుత్ర హోంనీడ్స్ ప్రతినిధులు

తాండూరు, జనవరి 17: తాండూరు సాయిపుత్ర హోమ్స్ ప్రతినిధి బి.శంకర్‌యాదవ్ దంపతులు చంద్రకళ కుమారుడు అభినవ్ హనుమయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం బుధవారం తాండూరు నుంచి వేలాదిగా పాదయాత్రకు వెళ్లిన భక్తులకు అన్నదానం చేశారు. కొడంగల్ సమీపంలోని ఉడిమేశ్వరం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ న్యాయవాది పాశం రవికుమార్, గోపాల్‌యాదవ్, మధుసూధన్‌రెడ్డి, శంకరన్న యువసేన సంఘం సభ్యులు స్నేహితులు, బంధుమిత్రులు పాల్పంచుకున్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. కాళ్ళకల్‌కు చెందిన ఆండాలు, ఉప్పరిపల్లికి చెందిన చీకోటి నర్సింహ, యశోద దంపతులు, గున్నాల మల్లేష్, నాగమణి దంపతులు, తిమ్మాయిపల్లికి చెందిన భూపాల్ రెడ్డి, విమల దంపతులు, బొమ్మరాసిపేటలకు చెందిన బిక్షపతిరెడ్డి, లక్ష్మి దంపతులు, శ్రీకాంత్‌రెడ్డి, శ్వేతా దంపతులు, వారి కుటుంబ సభ్యులు మానస, నితిన్ రెడ్డిల సహకారంతో అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



ఉప్పరిపల్లి పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

దుబాయ్ బయల్దేరిన మేడ్చల్ కౌన్సిలర్లు



ఎయిర్‌పోర్టులో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల భర్తలు

మేడ్చల్ టౌన్, జనవరి 17: ముందు నుంచి అందరు ఊహించిన మాదిరిగానే మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు దుబాయ్ విహార యాత్ర కోసం బుధవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ యాత్రలో పాల్గొనే కీలక వ్యక్తి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కొందరు నేతలతో ఒక రోజు ముందు మంగళవారం సాయంత్రం దుబాయికి చేరుకున్నారు. కాగా బుధవారం మేడ్చల్ కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు పట్టణం బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బయల్దేరారు. నేతలు ఫ్లైట్ ఎక్కేముందు దిగిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడం గమనార్హం.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మద్యం సీసా



ఆసుపత్రి ఆవరణలో బీరు సీసా

వికారాబాద్, జనవరి 17: వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మద్యం సీసా దర్శనమిచ్చింది. పార్కింగ్ ప్రదేశంలోనే గార్డెన్ ఆవరణలో బీరు సీసా చూసిన జనం నోరెళ్లబెడుతున్నారు. వైద్యం అందించాల్సిన ప్రదేశంలో బీరుసీసాలు ఉండడమేంటని ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి



సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు


కులకచర్ల, జనవరి 17: కులకచర్ల చౌరస్తా నుంచి పశువైద్యశాల వరకు సగంలో నిలిచిపోయిన డబుల్ సీసీరోడ్డు పనులను పూర్తి చేయాలని బుధవారం సర్పంచ్ సౌమ్యరెడ్డికి స్థానిక వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. గత 18 నెలల కిందట కులకచర్ల చౌరస్తా నుంచి చిన్న గేటు పశు వైద్య శాల వరకు డబుల్ సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఓపక్క మాత్రమే సదరు కాంట్రాక్టర్ సీసీరోడ్డు వేసి మరో పక్క వేయకుండా వదిలివేయడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. కంకరవేసి వదిలేయడంతో దుమ్ము దుకాణాల్లోకి వస్తోందని, ప్రజాప్రతినిధులతో, ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పనులు పూర్తి చేయించాలని సర్పంచ్‌ను కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సౌమ్యరెడ్డి వ్యాపారస్తులతో తెలిపారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలో ఇళ్ల మధ్య, ప్రైవేట్ పాఠశాల భవనంపైన నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇళ్లమధ్య, అదీ పాఠశాలపైన సెల్ టవర్ నిర్మాణం చేపట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే కేంద్రీయ విద్యాలయంతోపాటు చుట్టూ ఇళ్లు ఉన్నాయని సెల్‌టవర్‌తో రెడియేషన్ సమస్యలు తలెత్తే ప్రమాదముందని కాలనీవాసులు వాపోయారు. పాఠశాలలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సెల్‌టవర్లు నిర్మించొద్దని నిబంధనలు సూచిస్తున్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే సెలవు దినాల్లో పనులు సగం వరకు పూర్తి చేశారని మిగతాపని జరుగకుండా చూడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రమాదేవి, విజయ్ కుమార్, నార్ల మల్లేష్, శ్రీనివాస్, నాగులు, ఉషా, నారాయణరెడ్డి, శ్రీకుమార్, మణి, శ్రావణి న్నారు.

మృత్యు మలుపులు..!

- ప్రధాన రోడ్లపై కనిపించని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



బషీరాబాద్- తాండూరు మార్గంలో నారాయణపూర్ గేటు వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

బషీరాబాద్, జనవరి 17: మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపుల్లో ఎలాంటి సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక ఈ దారిలో ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. పలుమార్లు మూల మలుపుల్లో ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నా ప్రమాదం జరిగినప్పుడే హడావుడి చేసే ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు ఆ తర్వాత ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సమీపంలోని మలుపు, కొర్విచెడ్‌ఘని వద్ద మలుపు, మాసన్‌పల్లి గేటు సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇదేమార్గంలో నారాయణపూర్ గేటు, ఎన్కెపల్లి గేటు వద్ద మూల మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. బషీరాబాద్-మైల్వార్ మార్గంలో ఎక్మాయి సమీపంలోని మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన మలుపుల వద్ద సూచిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.